ప్రజాశక్తి
మంగళవారం 4 ఏప్రిల్ 2023 5 అనంతపురం





కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న డివైఎఫ్ఐ నాయకులు, నిరుద్యోగులు

# ప్రశాంతంగా పది పరీక్షలు

## 391 మంది విద్యార్థులు గైర్హాజరు

**ప్రజాశక్తి-అనంతపురం సిటీ**

పదోతరగతి వార్షిక పరీక్షలు సోమవారం నాడు మొదలయ్యాయి. మొదటి రోజు జరిగిన తెలుగు పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ముందస్తు సూచనల మేరకు విద్యార్థులు 8 గంటలకే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. ఆర్టీసీతో పాటు ఆయా పాఠశాలలు విద్యార్థులను పరీక్ష కేంద్రాలకు చేర్చేందుకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. పరీక్షల నిర్వహణ కోసం 2094 మంది ఇన్విజిలేటర్లు, 7 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించారు. అనంతపురం జిల్లాలో మొదటి రోజు పరీక్షకు 30693 మందికిగానూ 391 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. అనంతపురంలోని రాజేంద్ర మునిసిపల్ హైస్కూల్ పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పరిశీలించారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్, డీఈవో సాయిరాం పాల్గొన్నారు. ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప అనంతపురంలోని భాష్యం పాఠశాలను పరిశీలించారు. పరీక్షల నిర్వహణ సందర్భంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో తీసుకున్న చర్యలపై వివరించారు. మాస్ కాపీయింగ్, మాల్ ప్రాక్టీస్ తదితర అక్రమాలకు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా విద్యాశాఖ అధికారి సాయిరాం రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నేతాజీ సుభాష్ చంద్రబోస్ నగరపాలక ఉన్నత పాఠశాల, రాజేంద్ర నగరపాలక ఉన్నత పాఠశాల, అనంతపురం పాతూరు కస్తూరిబా ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల నెంబర్-2 కేంద్రాలను పరిశీలించారు.

### పరీక్షలు రాసిన అంధ విద్యార్థులు

**అనంతపురం :** అనంతపురం జిల్లాలో ఆరుగురు అంధ విద్యార్థులు ఎవరి సహకారం లేకుండా వారి ల్యాప్‌ట్యాప్‌ల ద్వారా వారే స్వయంగా పరీక్ష రాశారు. రాష్ట్రంలోనే తొలిసారి అంధ విద్యార్థులు ఇలా పరీక్షలు రాశారు. రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన తెలుగు పరీక్షలో వీరు ల్యాప్‌ట్యాప్ ద్వారా పరీక్ష రాశారు. ఈ విద్యార్థులు అంతా ఆర్డీటీ ఇన్లీవ్‌జీవ్ పాఠశాలల్లో చదువుతున్నారు.



హిందూపురంలో పరీక్ష కేంద్రం వద్ద నెంబర్ చూసుకుంటున్న విద్యార్థులు

### మారిన ప్రశ్నాపత్రం

#### ఎనిమిది మంది ఇన్విజిలేటర్లు సస్పెన్షన్

అనంతపురం జిల్లాలో జరిగిన పదవ తరగతి పరీక్షల్లో మొదటి రోజు రెండు తప్పిదాలు జరిగాయి. అనంతపురం నగరంలోని రెండు పాఠశాలల్లో ఇద్దరు విద్యార్థులకు వేరువేరు ప్రశ్నాపత్రాలను ఇన్విజిలేటర్లు ఇచ్చారు. ఈ తప్పిదాన్ని అధికారులు ఆలస్యంగా గుర్తించారు. విద్యార్థుల, తల్లిదండ్రులు దీనిపై ఆందోళన చెందడటంతో ఉన్నతాధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని జిల్లా విద్యాశాఖ అధికారి సాయిరామ్ హామీనిచ్చారు. దీనికి సంబంధించి వివరాలు ఈ విధంగా ఉన్నాయి. అనంతపురం నగరంలోని భాష్యం పాఠశాలలో పరీక్ష రాసిన నందిని అనే అమ్మాయి, సివిఆర్ పాఠశాలలో జశ్వంత్‌లకు ఫస్ట్ లాంగ్వేజ్ వంద మార్కుల ప్రశ్నాపత్రం ఇవ్వాల్సి ఉండగా 75 మార్కుల కంపోజిట్ ప్రశ్నాపత్రంను ఇన్విజిలేటర్లు ఇచ్చారు. సదరు విద్యార్థులు పరీక్ష రాసిన తరువాత ఈ విషయాన్ని గ్రహించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై విద్యాశాఖ అధికారులు ఆరా తీసి ఇన్విజిలేటర్ల అలసత్వం కారణంగా తప్పిదం జరిగిందని భావించి నాగవేణి, నాగభూషణం అనే ఇన్విజిలేటర్లను సస్పెండ్ చేశారు. అంతకు మునుపు పొట్టి శ్రీరాములు పాఠశాలను కలెక్టర్ నాగలక్ష్మి పరిశీలించి నప్పుడు విధులు సక్రమంగా నిర్వహించడం లేదని గ్రహించి ఇన్విజిలేటర్లు శివమ్మ, రాజన్న, గంగిరెడ్డిలను సస్పెండ్ చేశారు. ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డి కూడా మొదటి రోజు అనంతపురం నగరంలో పొట్టిశ్రీరాములు, నేతాజీ పాఠశాలల్లోని పరీక్షా కేంద్రాలు తనిఖీ చేశారు. లోపాలను గ్రహించి బాబురావు, చిట్టంరెడ్డి, నాగరాజులను సస్పెండ్ చేశారు.

### రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి



మృతి చెందిన విద్యార్థి వంశీ(ఫైల్ ఫొటో)

**ఉరవకొండ రూరల్ :** పది పరీక్షలు రాసే పరీక్షా కేంద్రాన్ని చూసేందుకు వెళ్తున్న రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి చెందిన సంఘటన అనంతపురం జిల్లా విడపనకల్లు మండల కేంద్రంలోని మోడల్ హైస్కూల్ సమీపంలో సోమవారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... విడపనకల్లు మండల పరిధిలోని హావలిగి గ్రామానికి చెందిన కె.వంశీ(17), జి.మల్లికార్జునలు పది సప్లిమెంటరీ పరీక్షలు రాస్తున్నారు. ఇందులో భాగంగా వీరు పరీక్ష రాయనున్న విడపనకల్లు మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రాన్ని చూసేందుకు సోమవారం నాడు స్వగ్రామం నుంచి ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. మోడల్ స్కూల్ వద్దకు రాగానే ద్విచక్రవాహనం ఎదురుగా వస్తున్న కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో వంశీ, మల్లికార్జునలు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే స్థానికులు వారిని చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచనల మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం వంశీని బెంగళూరుకు, మల్లికార్జునను తిరుపతికి తరలించారు. బెంగుళూరులో చికిత్స పొందుతూ వంశీ మృతి చెందాడు. ప్రమాదం విషయం తెలుసకున్న విడపనకల్లు మండల జెసిఎస్ కన్వీనర్ భరత్ రెడ్డి, హావలిగి సర్పంచి రఘురాములు, ఎంపీటీసీ రాజశేఖర్, మండల విద్యాశాఖ అధికారి ప్రభావతమ్మ అనంతపురంలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించారు.

### గాయాలతోనే పరీక్ష రాసి..

**హిందూపురం :** ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ విద్యార్థి మరో విద్యార్థి సాయంతో పరీక్ష రాశాడు. శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం పట్టణంలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... హిందూపురం పట్టణ పరిధిలోని ముదిరెడ్డిపల్లి జిల్లా ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థి ముఖేష్ గత నెల 26వ తేదీన పాఠశాలలో సరస్వతి పూజా కార్యక్రమం పూర్తి చేసుకుని ద్విచక్ర వాహనంలో ఇంటికి వెళుతుండగా ప్రమాదవాశత్తు కుక్క అడ్డు రావాడంతో అదపు తప్పి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో విద్యార్థి తల, చేతులకు తీవ్రంగా దెబ్బలు తగిలాయి. విద్యార్థి పరిస్థితి విషమంగా ఉండడంతో తల్లిదండ్రులు చికిత్స నిమిత్తం బెంగళూరుకు తీసుకెళ్లారు. అక్కడ వైద్య సేవలు పొందుతున్న విద్యార్థి ఎలాగైన పదవ తరగతి పరీక్షాలనే ఆకాంక్షను తల్లిదండ్రులకు తెలిపారు. తల్లిదండ్రులు విద్యార్థి సంఘ నాయకుడు అభిను సంప్రదించారు. అతను జిల్లా విద్యాశాఖ అధికారితో మాట్లాడారు. ప్రమాదంలో గాయపడి పరీక్ష రాయలేని స్థితిలో ఉన్న విద్యార్థికి మరో విద్యార్థినిని సాయంగా ఇచ్చారు. నేతాజీ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి పరీక్ష రాయగా ముఖేష్ సమాధానాల చెప్పాడు. తలకు తీవ్రంగా గాయం కావడంతో ముఖేష్ పరీక్షను పూర్తి స్థాయిలో రాయలేకపోయాడు.



గాయపడి పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థి



పరీక్ష కేంద్రానికి కుమారున్ని మోసుకుని తీసుకొచ్చిన తల్లి

### అమ్మతోడుగా.. పరీక్ష రాయగా..!

**పుట్లూరు :** నడవలేని స్థితిలో ఉన్న కుమారున్ని ఎత్తుకుని పరీక్షా కేంద్రానికి తీసుకెళ్లి ఓ తల్లి పది పరీక్షలను రాయించింది. అనంతపురం జిల్లా పుట్లూరు మండలం కడవకల్లు గ్రామానికి చెందిన భరత్ కుమార్‌రెడ్డి వికలాంగుడు. కడవకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈయన 10వ తరగతి చదివాడు. ఇతను పది పరీక్షలను పుట్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాయాల్సి ఉంది. కడవకల్లు గ్రామం నుంచి ఈ కేంద్రం ఎనిమిది కిలోమీటర్ల దూరం ఉంది. నడవలేని స్థితిలో ఉన్న కుమారున్ని విద్యార్థి తల్లి మునెమ్మ తన చేతులు మీద మోసుకెళ్లి పరీక్షా కేంద్రంలో కూర్చొబెట్టింది. పరీక్షల అనంతరం ఆమె మళ్లీ కుమారున్ని చేతలపై ఎత్తుకుని కేంద్రం నుంచి బయటకు తీసుకెళ్లింది. వికలాంగుడైన ఆ విద్యార్థి పరీక్ష రాసేందుకు అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కుమారుని భవిష్యత్తు కోసం ఆతల్లి చూపిన ప్రేమను పలువురు అభినందించారు.

### ప్రత్యేక పరిశోధనలు జరగాలి

**అనంతపురం :** సాంకేతిక విద్యలో ఉన్నత ప్రమాణాలతో కూడిన పరిశోధనలు జరగాలని ఎంఐటి వరంగల్ ఆచార్యులు సురేష్‌బాబు సూచించారు. సోమవారం అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో 'యాంత్రిక స్థితి, పనితీరు, లోప నిర్వహణ' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా ఆధునిక యంత్రాలను ఎలా పరీక్షించాలో పవర్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అలాగే విద్యార్థులకు సాంకేతిక విద్యలో ఉన్నత ప్రమాణాలు, పరిశోధన అంశాలు, ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మెకానికల్ విభాగాధిపతి కళ్యాణిరాధ, సమన్వయకర్త బి.ఓంప్రకాష్, బోధన సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి

## అనంత కలెక్టరేట్ ఎదుట డివైఎఫ్ఐ ధర్నా

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

రాష్ట్రంలో నిరుద్యోగుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వెంటనే 25 వేల పోస్టులతో మెగా డీఎస్సీని విడుదల చేయాలని డివైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు అనంతపురం కలెక్టరేట్ ఎదుట సోమవారం నాడు ధర్నా చేపట్టారు. అంతకు ముందు సంగమేష్ సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలకష్ణ, నరసింహ మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటికే దాదాపు 30 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల సందర్భంగా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి అసెంబ్లీ సాక్షిగా కేవలం 771 పోస్టులు మాత్రమే ఖాళీగా ఉన్నాయని అవాస్తవాలను వెల్లడంచడం విచారకరం అన్నారు. గత ఎన్నికల సమయంలో వైసిపి అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరమే జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, ప్రతి ఏడాదీ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తామని వైఎస్.జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి నాలుగు సంవత్సరాలు పూర్తి అవుతున్నా ఇంతవరకు ఒక్క డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసిన దాఖలాలు లేవన్నారు. రాష్ట్రం వ్యాప్తంగా గత ఐదు సంవత్సరాలుగా బీఈడీ, టీటీసీ పూర్తిచేసిన విద్యార్థులు దాదాపు 18 లక్షల మంది ఉన్నారన్నారు. వారంతా డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఇంత మంది నిరుద్యోగుల భవిష్యత్తును పట్టించుకోకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వెంటనే 25 వేల పోస్టులతో మెగా డీఎస్సీ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రంలో నిరుద్యోగులను కలుపుకుని అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి చరణ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్, డివైఎఫ్ఐ నగర అధ్యక్ష, కార్యదర్శులు వలి, శివ, షరీఫ్ విజయ్, గిరి పాల్గొన్నారు.

# పోలీసుల నిర్లక్ష్యంతోనే దళిత యువతి హత్య

## సిఐ, ఎస్ఐలను సస్పెండ్ చేయాలి : కెవిపిఎస్

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

నార్పల మండలంలో దళిత యువతి మిస్సింగ్, హత్యను ఛేదించడంలో పోలీసుల నిర్లక్ష్యం ఉందని, దీనిపై విచారణ జరిపి శింగనమల సిఐ, నార్పల ఎస్ఐలను సస్పెండ్ చేయాలని కెవిపిఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా రెవెన్యూ భవన్‌లో జరిగిన స్పందనలో ఆర్డీవో మధుసూధన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా అధ్యకులు జి.వెంకటేష్ మాట్లాడుతూ నార్పల మండలం బొందలవాడ గ్రామంలో దళిత యువతి కడపల రమాదేవిని నడిమిదొడ్డి గ్రామానికి చెందిన జాఫర్ హత్య చేశారన్నారు. యువతి కన్పించకుండా పోయిన రోజును ఆమె తల్లిదండ్రులకు పోలీసులకు ఫిర్యాదు చేశారని చెప్పారు. అయినా పోలీసులు సరిగా స్పందించలేదన్నారు. దళిత సంఘాల ఆందోళనల తరువాతనే కేసు నమోదు చేశారన్నారు. ఆ తరువాత బుక్కరాయసముద్రం చెరువులో యువతి మృతదేహం లభ్యమైందని చెప్పారు. ప్రియుడు జాఫర్ హత్య చేసినట్లు స్పష్టంగా అర్థమైందన్నారు. యువతి కన్పించకుండా పోయిన రోజునే పోలీసులు సకాలంలో స్పందించి ఉంటే హత్య ఘటన జరిగి ఉండేది కాదన్నారు. ఈ కేసు విచారణ, దర్యాప్తులో శింగనమల సిఐ, ఎస్ఐ నిర్లక్ష్యం స్పష్టంగా కన్పిస్తోందని చెప్పారు. ఉన్నతాధికారులు దీనిపై పూర్తి దర్యాప్తు చేసి వారిద్దరినీ సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు శివ, నాగేంద్ర, షరీఫ్, వలీ, మద్దిలేటి, రాజశేఖర్ పాల్గొన్నారు.

## విద్యుత్ భారాలను ఉపసంహరించండి : సిపిఎం

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

విద్యుత్ ఛార్జీలను పెంచలేదని ఒకవైపున నోటిఫికేషన్ జారీ చేస్తూ, మరోవైపు సర్దుబాటుఛార్జీల పేరుతో దొడ్డిదారిన భారాలు వేయడం మోసపూరితమని సిపిఎం జిల్లా కమిటీ విమర్శించింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 2023 ఏప్రిల్ నుంచి కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్రంలో ప్రతినెలా విద్యుత్ యూనిట్‌కు 40 పైసల చొప్పున అదనంగా సర్దుబాటు ఛార్జీలు(ట్రూఅప్) వసూలు చేస్తోందని చెప్పారు. ప్రతి నెలా వసూలు చేయడమే కాకుండా మళ్లీ సంవత్సరాంతంలో అవసరమైతే అదనంగా సర్దుబాటు భారం మోపే ప్రమాదం ఉందన్నారు. గత సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం 1400 కోట్ల రూపాయలు విద్యుత్ ఛార్జీలను పెంచి ప్రజలపై భారం వేసిందన్నారు. 2014-19 మధ్య వినియోగించుకున్న విద్యుత్‌కు ఇప్పుడు 36 నెలల పాటు యూనిట్‌కు 25 పైసలు చొప్పున వసూలు చేయడం దుర్మార్గమన్నారు. దీని వల్ల ప్రజలపై రూ.2900 కోట్ల భారం పడుతోందన్నారు. స్మార్ట్ మీటర్లు పెట్టి ఆ వ్యయాన్ని నెలవారీగా ప్రజలపై వేసే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. జిల్లాలో వ్యవసాయ విద్యుత్ మోటార్లకు మీటర్లు పెట్టడానికి ప్రభుత్వం అనేక ప్రయత్నాలు చేస్తోందన్నారు. ఇదే జరిగితే జిల్లా వ్యవసాయం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అదానీ, ఇతర కార్పొరేట్ కంపెనీలకు మేలు చేసే రీతిలో బొగ్గు అధిక రేట్లకు కొనుగోలు చేసి సర్దుబాటు ఛార్జీల పేరుతో దండుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ ఛార్జీలను పెంచబోమని మాట చెప్పి అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం మాట తప్పి ఇలా భారాలు మోపడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి ప్రతినెలా విద్యుత్ సర్దుబాటు ఛార్జీలు విధించి భారాలు వేసే ఆదేశాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

# జగన్ రెండు బటన్ల సిఎం

- పది రూపాయలిచ్చి రూ.వంద లాగుతున్నాడు..
- ఎనిమిదిసార్లు విద్యుత్ ఛార్జీల పెంపు
- రైతులను అన్ని విధాలా ఆదుకుంటాం
- యువగళం పాదయాత్రలో నారాలోకేష్



లోకేష్‌కు నాగళి బహూకరిస్తున్న టిడిపి నాయకులు, రైతులు

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి, బత్తలపల్లి**

జగన్ రెండు బటన్ల సిఎం అని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఎద్దేవా చేశారు. ఒక బటన్ నొక్కి పది రూపాయలు అకౌంట్లోకి వేస్తే మరో బటన్ నొక్కి రూ.100 అకౌంట్ నుంచి లాగేస్తున్నాడని విమర్శించారు. లోకేష్ యువగళం పాదయాత్ర సోమవారం 59వ రోజు బత్తలపల్లి మండలం ముష్టూరు క్రాస్ వద్ద ఏర్పాటు చేసిన విడిది కేంద్రం నుంచి సంజీవపురం, యర్రాయపల్లి, మన్నీల మీదుగా రాప్తాడు నియోజకవర్గంలోకి ప్రవేశించింది. రాప్తాడు నియోజకవర్గంలో మన్నీల క్రాస్, కృష్ణంరెడ్డిపల్లి, ఇటుకలపల్లి, ఎస్కె యూనివర్సిటీ మీదుగా పంగల్‌రోడ్డులోని విడిది కేంద్రం వరకు కొనసాగింది. ముష్టూరు వద్ద రైతులు, సంజీవపురంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, ఎస్కెయులో విద్యార్థులతో మాట్లాడారు. ఆయా ప్రాంతాల్లో రైతులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, విద్యార్థులు లోకేష్ దృష్టికి పలు సమస్యలను తీసుకొచ్చారు. ఎస్కెయు వద్ద విద్యార్థి సంఘాల నాయకులు విశ్వవిద్యాలయ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గతంలో ఫ్యాక్షన్ హత్యకు గురైన తగరకుంట ప్రభాకర్ కుమార్తె శ్రావణిని లోకేష్‌ను కలిసింది. ప్రభాకర్ మృతి అనంతరం శ్రావణిని ఎన్టీఆర్ మోడల్ స్కూల్‌లో చదివించారు. దీనికి శ్రావణి కృతజ్ఞతలు తెలిపింది. పాదయాత్ర సందర్భంగా పలుచోట్ల ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. సంక్షేమ ప్రభుత్వమని చెప్పుకునే వైఎస్.జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక వంద పథకాలను రద్దు చేసాడని విమర్శించారు. బటన్ నొక్కి అకౌంట్‌లోకి పది రూపాయలు వస్తే, టేబుల్ కింద బటన్ నొక్కి వంద రూపాయలు బాదుడుతున్నాడన్నారు. రాష్ట్రంలో మద్యం అమ్మకాలను తగ్గిస్తామని అధికారంలోకి రాకముందు హామీని వైసిపి ఇచ్చిందని గుర్తు చేశారు. ఇప్పుడేమో మద్యం అమ్మకాలపై ఆదాయం చూపించి రూ.25 వేల కోట్లు అప్పు తెచ్చారని విమర్శించారు. దిశ చట్టం పెద్ద మోసమని దుయ్యబట్టారు. చట్టమే లేకుండా పోలీసు స్టేషన్లు ప్రారంభించారని తెలిపారు. వైసిపి నేతల దెబ్బకు రాష్ట్రానికి పరిశ్రమలు వచ్చే పరిస్థితి లేకుండాపోయిందని చెప్పారు. ఇక్కడ కూడా జాకీ పరిశ్రమ వచ్చి పోయిందని పేర్కొన్నారు. దీంతో ఆరువేల కుటుంబాలకు ఉపాధి లేకుండపోయిందని తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వాలు మారినా పరిశ్రమలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉండే చట్టాన్ని తీసుకొస్తామని చెప్పారు. తెలుగు రైతు అధ్యక్షులు చల్లా శ్రీనివాసులు నాయుడు, గంటాపురం జగ్గుల ఆధ్వర్యంలో పలువురు రైతులు రైతాంగ సమస్యలను లోకేష్ దష్టికి తీసుకువచ్చారు. వీటిపై లోకేష్ మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి రాగానే వ్యవసాయాన్ని లాభసాటిగా చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తామన్నారు. మూడేళ్లుగా అతివష్టి, అకాల వర్షాల కారణంగా వేరుశనగ రైతులు తీవ్రంగా నష్టపోయిన ప్రభుత్వం పరిహారం ఇవ్వలేదన్నారు. సేకరించిన ధాన్యానికి సకాలంలో డబ్బు చెల్లించకుండా ఇబ్బంది పెడుతున్నారని, క్రాప్ ఇన్సూరెన్స్, సబ్సిడీలు కేవలం 20శాతం మంది రైతులకు మాత్రమే అందుతున్నాయని చెప్పారు. రైతుల సమస్యలన్నింటినీ పరిష్కరించేలా అన్ని చర్యలూ తీసుకుంటామని హామీ ఇచ్చారు. మాజీ మంత్రి పరిటాల సునీత మాట్లాడుతూ జాకీ పరిశ్రమ పోకుండా ఉండాలని పోరాటం చేసిన వంద మంది మహిళలలపై ఈ ప్రభుత్వం కేసులు పెట్టిందని గుర్తు చేశారు. మహిళలకు తెలుగుదేశం ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం నియోజకవర్గం ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్, మాజీ ఎమ్మెల్సీ గండుమల తిప్పేస్వామి నాయకులు మదమంచి స్వరూప, బోయపాటి అప్పస్వామి నాయుడు, రాఘవంపల్లి శ్రీనివాసులు పాల్గొన్నారు.

#### నేడు అనంతలో పర్యటన

రాప్తాడు నియోజకవర్గం పరిధిలో పాదయాత్ర నేడు ముగియనుంది. మంగళవారం ఉదయం నుంచి అనంతపురం నియోజకవర్గంలోకి యాత్ర ప్రారంభం కానుంది. భోజన విరామ సమయానికి విజయనగర కాలనీ వరకు యాత్ర సాగనుంది. అటు తరువాత సాయంత్రం నాలుగు గంటలకు అక్కడి నుంచి ప్రారంభమై సంగమేశ్ సర్కిల్, పవర్ ఆఫీసు, విజయ క్లాత్ సెంటర్ మీదుగా సప్తగిరి సర్కిల్ వరకు సాగనుంది. అక్కడి నుంచి అంబేద్కర్ సర్కిల్ మీదుగా రుద్రంపేట బైపాస్, కళ్యాణదుర్గం బైపాస్, బళ్లారి బైపాస్ మీదుగా ఎంవైఆర్ ఫంక్షన్ హాలుకు చేరుకోనుంది. రాత్రి పది గంటలకు అక్కడికి చేరుకుని బస చేస్తారు.

# పంటలకు మద్దతు ధర చట్టం తీసుకురావాల్సిందే..

## ఎపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్ రెడ్డి

## చలో ఢిల్లీకి తరలిన రైతుసంఘం నాయకులు, రైతులు




ఢిల్లీకి వెళ్తూ రైల్వేస్టేషన్‌లో ఉన్న ఎపి రైతుసంఘం నాయకులు, రైతులు

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం అన్ని పంటలకు మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించేందుకు పార్లమెంట్‌లో చట్టం తీసుకురావాలని ఎపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈనెల 5న ఢిల్లీలో జరుగుతున్న ఆందోళనకు సోమవారం జిల్లా నుంచి రైతుసంఘం నాయకులు, రైతులు భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురము జిల్లాకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని, తుంగభద్ర ప్రాజెక్టు ద్వారా రాయలసీమకు ఉన్న సాగునీటి హక్కులను కాపాడాలని, హంద్రీనీవాను జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించాలని, పిఎం కిసాన్ సన్మాన్ ద్వారా జిల్లాలో డ్రిప్, స్ప్రింక్లర్లను ఉచితంగా అందజేయాలని, పండ్లతోటలకు అనుబంధంగా జ్యూస్ ఫ్యాక్టరీలు ఏర్పాటు చేయాలని, వ్యవసాయ రంగానికి ఎరువుల సబ్సిడీలు పెంచాలని, విద్యుత్ సవరణ బిల్లు-2022ను ఉపసంహరించుకోవాలని, అనంతపురం పేద, మధ్యతరగతి రైతులకు నెలకు రూ.5వేలు పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ 5వ తేదీన ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గతంలో రైతాంగ ఉద్యమ ఫలితంగా మద్దతు ధర గ్యారెంటీ చట్టం తీసుకొస్తామని హామీ ఇచ్చి మోడీ ప్రభుత్వం తర్వాత విస్మరించిందన్నారు. కార్పొరేట్ కంపెనీలకు వేలకోట్లు రుణమాఫీలు చేస్తున్న కేంద్రం రైతుల రుణాలు ఎందుకు మాఫీ చేయడం లేదని ప్రశ్నించారు. సేంద్రీయ వ్యవసాయం, చిరుధాన్యాల వ్యవసాయం చేసే రైతులకు ప్రోత్సాహకులు అందిస్తామని చెబుతూనే వ్యవసాయం మార్కెట్ కార్పొరేట్ కంపెనీల మార్కెట్‌గా మార్చేసి కార్పొరేట్ వ్యవసాయానికి కేంద్ర ప్రభుత్వం బాటలు వేసిందన్నారు. అలాగే సన్న, చిన్న కారు, పేద, కౌలు రైతుల సంక్షేమానికి సహకార సొసైటీలను డిజిటలైజేషన్ చేస్తామని, గోడౌన్స్ నిర్మిస్తామని చెబుతూనే మరోవైపు సహకారంగాన్ని నిర్వీర్యం చేస్తోందన్నారు. మరోవైపు ఉపాధి పథకం నిధులు కోత పెట్టడం తగదన్నారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని చలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఢిల్లీకి తరలిన వారిలో ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు తరిమెల నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షులు మధుసూదన్, రాజారామిరెడ్డి, విటి రామాంజినేయులు, రాయుడు, జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాసులు, చెన్నారెడ్డి, పోతలయ్య, వెంకటకొండ నారాయణరెడ్డి, నాగమ్మ, చిదంబరమ్మ, రైతులు జయశేఖర్, రమేష్, పార్వతి, సుభద్రమ్మ, రామాంజి, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# సెంట్రల్ వర్సిటీ విసిపై చర్యలు తీసుకోవాలి

### కలెక్టర్‌కు ఎస్ఎఫ్ఐ నాయకుల వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

రాజ్యాంగ హక్కుగా దేశంలో విద్యార్థులకు ఉన్న స్వేచ్ఛ, వాక్ స్వాతంత్య్రం హక్కులను హరిస్తున్న సెంట్రల్ యూనివర్శిటీ వైస్‌ఛాన్స్‌లర్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతురు పరమేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కలెక్టర్ నాగలక్ష్మికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయన సెంట్రల్ యూనివర్శిటీలో చోటు చేసుకున్న అవతవకలపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా మౌలిక వసతులైన తాగునీరు, మరుగుదొడ్లు, భోజనంలో పురుగులు వస్తున్నాయని, సొంత భవనాలు నిర్మించాలని విసికి ఫిర్యాదు చేశారనే నెపంతో ఐదుగురు విద్యార్థులను సస్పెండ్ చేయడం బాధాకరమన్నారు. వెంటనే విద్యార్థులపై సస్పెన్షన్ ఎత్తివేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి గిరి, నాయకులు విజయ్, చంద్రకాంత్, వినోద్, కిరణ్, తదితర నాయకులు పాల్గొన్నారు.

# పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

### సిపిఎం ఆధ్వర్యంలో డిప్యూటీ తహశీల్దార్లకు వినతి



శింగనమల డిప్యూటీ తహశీల్దార్ ప్రకాశ్‌రావుకు వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు

**ప్రజాశక్తి-శింగనమల**

అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం అందించి ఆదుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు ఈమేరకు శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ ప్రకాశ్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పరిహారం చెల్లించాలన్నారు. జిల్లావ్యాప్తంగా 16 మండలాల్లోని 46 గ్రామాల్లో 4843 ఎకరాల్లో ఉద్యానవన పంటలు నాశనం అయ్యాయన్నారు. వీటిలో శింగనమల మండలంలో కూడా అధిక శాతం పంటలకు నష్టం సంభవించిందన్నారు. ముఖ్యంగా మామిడి, నిమ్మ, చీనీ వంటి పంటలు తోటల్లోనే కాయలు రాలిపోయి తీవ్రంగా రైతులు నష్టపోయారన్నారు. అలాగే మిర్చి పంట కోసిన తర్వాత కళ్లాల్లో ఉన్న పంట నాశనమైందన్నారు.కౌలు రైతుల పేర్లు ఈక్రాప్ బుకింగ్‌లో లేనందువల్ల పెట్టుబడులు పెట్టి నష్టపోయారన్నారు. కావున రైతులందరికీ బ్యాంకుల్లో నిర్ణయించిన స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ఆధారంగా పంట నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రైతు సంఘం మండల కార్యదర్శి లక్ష్మీనారాయణరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి సుంకన్న, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి సూర్యప్రకాష్, సిఐటియు మండల కార్యదర్శి గంప మల్లయ్య, నాయకులు శివ, మల్లయ్య, మల్లప్ప, తదితరులు పాల్గొన్నారు.

**గుత్తి :** అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పరిహారం చెల్లించాలని సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఉప తహశీల్దార్ శ్రీలతకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి బి.రామకృష్ణ, సిఐటియు మండల అధ్యక్షులు ఎం.మల్లేష్ మాట్లాడుతూ గతనెలలో ఈదురుగాలులు, వడగండ్ల వర్షాలతో జిల్లావ్యాప్తంగా ఉద్యానవన పంటలతోపాటు ఇతర పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి పంట నష్టాన్ని సక్రమంగా అంచనా వేసి రైతులకు పరిహారం అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ మండల కార్యదర్శి యు.మల్లికార్జున, ఐద్వా మండల అధ్యక్షురాలు కవిత, ఎస్ఎఫ్ఐ నాయకులు రమేష్, గౌతమ్‌నాయక్, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

## నేరాలు ఘోరాలు

# వ్యక్తి అనుమానాస్పద మృతి



మృతిచెందిన కొలారప్ప

**కళ్యాణదుర్గం :** మున్సిపాలిటీ పరిధిలోని ముదిగల్లు గ్రామానికి చెందిన కొలారప్ప (40) సోమవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. రోజువారీదినానే ఉదయం వ్యవసాయ పొలానికి వెళ్లిన కొలారప్ప మధ్యాహ్నం వరకు తిరిగి ఇంటికి రాలేదు. అయితే అటుగా వెళ్తున్న మేకల కాపరులు కొలారప్ప మృతిచెంది ఉండటాన్ని గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. తమ భర్తను ఎవరో హత్య చేసి ఉంటారని భార్య లక్ష్మీదేవి అనుమానం వ్యక్తం చేసింది. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# గుర్తు తెలియని శవం లభ్యం

**యాడికి :** మండలంలోని కుందనకోట గ్రామ శివారులో సోమవారం గుర్తు తెలియని శవం లభ్యమైనట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. బాగా కుళ్లిన శవంపై బెల్టు, ప్యాంటు, షర్టు ఆనవాళ్లు ఉన్నాయన్నారు. ఎవరైనా గుర్తు పడితే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

# 'ఓపెన్' పరీక్షల్లో మాస్‌కాపీయింగ్‌ను అరికట్టాలి

### కేంద్రాల వద్ద విద్యార్థి సంఘాల నిరసన

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

జిల్లావ్యాప్తంగా నిర్వహిస్తున్న ఓపెన్ ఇంటర్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌ను అరికట్టాలని ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, బిసి, ఎస్సీ, ఎస్టీ విద్యార్థి సమైక్య ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని ఓ పరీక్ష కేంద్రాల వద్ద నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విద్యార్థి సంఘాల నాయకులను అరెస్టు చేసి 1వ పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతురు పరమేష్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు సురేష్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి మాట్లాడుతూ ఓపెన్ ఇంటర్ పరీక్షల్లో విచ్చలవిడిగా మాస్‌కాపీయింగ్‌కు పాల్పడుతున్నా విద్యాశాఖ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అంతేగాకుండా పాస్ గ్యారెంటీ అని చెప్పి విద్యార్థుల నుంచి రూ.వేలు వసూలు చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మాస్‌కాపీయింగ్‌ను అరికట్టాలని లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

**BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR AT CHITTOOR**
**ARC.No. 17 OF 2021**

**Between:**
Kapil ChitS(Hyd) Pvt., Ltd., Madanapalli
Rep., by its Legal Officer
**..Disputant**
**And:**
V. Savithri Bai & others
**..Opponents**
**SUMMONS TO OPPONENTS NO. 3**

**To**
3. S.P.R. Yerri Swamy, S/o S. Kasine Naik, Working as SA(Maths), ZP High School, Inagalur Village, Agali Mandal, Anathapur District, Residing at D.No:- 6- 3-18, Main Road, OD Cherruvu, Agali, Ananthapur District.

**Sir's,**
Please take notice that the above case is posted to 15-04-2023 for your appearance. You may appear either in person or through an advocate on 15-04-2023 at 10.30 A.M. Without fail and file your objections, failing which the matter will be decided in your absence an ex party.

**Hearing Date: 15-04-2023**
**Sd/-**
**SRI. M. RAJESH, M.COM., LLB., ADVOCATE ; TIRUPATI**

**BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR AT CHITTOOR**
**ARC.No. 97 OF 2021**

**Between:**
Kapil ChitS(Hyd) Pvt., Ltd., Chittoor
Rep., by its Legal Officer
**..Disputant**
**And:**
V. Nagarathnamma & others
**..Opponents**
**SUMMONS TO OPPONENTS NO.3**

**To**
3. K.Murali Mohan,
S/o. K.Chennakesavulu, D.No:-5-3,
Hindu, aged 40 years, Working as School Assistant, ZP High School,
Hottevetta Village, Rolla Mandal,
Ananthapur District, Residing at
D.No. 3-102, Main Road,
Cholasamudram, Anantapur District,
Pin 515331

**Sir's,**
Please take notice that the above case is posted to 15-04-2023 for your appearance. You may appear either in person or through an advocate on 15-04-2023 at 10.30 A.M. Without fail and file your objections, failing which the matter will be decided in your absence an ex party.

**Hearing Date: 15-04-2023**
**Sd/-**
**SRI. M. RAJESH, M.COM., LLB., ADVOCATE ; TIRUPATI**

**BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR AT CHITTOOR**
**ARC.No. 8 OF 2021**

**Between:**
Kapil ChitS(Hyd) Pvt., Ltd., Madanapalli
Rep., by its Legal Officer
**..Disputant**
**And:**
T. Narendra & others
**..Opponents**
**SUMMONS TO OPPONENTS NO.2 & 5**

**To**
2. M. Eswarappa,S/o M.Venkatramanappa, Working as Manager, HRM, Saptagiri Gramina Bank, Madanapally, Chittoor District, Residing at D.No:- 3/474, Near Society, Gorantla, Ananthapur District. Pin:515231.
5. T.Venkata Sai Sreeharsha, S/o T.Narendra, Business, Residing at, Flat No:201, Rajahamsa Great Empire, Srinivas Nagar, Near Chandra Hospital, Anathapur District, Pin:515001.

**Sir's,**
Please take notice that the above case is posted to 15-04-2023 for your appearance. You may appear either in person or through an advocate on 15-04-2023 at 10.30 A.M. Without fail and file your objections, failing which the matter will be decided in your absence an ex party.

**Hearing Date: 15-04-2023**
**Sd/-**
**SRI. M. RAJESH, M.COM., LLB., ADVOCATE ; TIRUPATI**

# చైతన్య పాఠశాలపై చర్యకు డిమాండ్

**కళ్యాణదుర్గం :** పట్టణంలోని బళ్లారి రోడ్డులో ఉన్న శ్రీచైతన్య టెక్నో పాఠశాల్లో జరుగుతున్న అక్రమాలపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అచ్యుత్‌ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పాఠశాలలో 10వ తరగతికి అనుమతులు పొందామని అడ్మీషన్లు స్వీకరించి అనంతపురం బ్రాంచ్‌లో అడ్మీషన్లు చేసి విద్యార్థుల తల్లితండ్రులను మోసం చేస్తున్నారన్నారు. దీంతో ఇక్కడ వసతులు లేకపోవడంతో విద్యార్థులు అనంతపురం వెళ్లి పరీక్షలు రాసే పరిస్థితి తలెత్తిందన్నారు. కావున ఉన్నతాధికారులు వెంటనే స్పందించి పాఠశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# అనంత అభివృద్ధిపై సెల్ఫీ తీసుకో..

### నారాలోకేష్‌కు మేయర్ వసీం సూచన



విలేకరులతో మాట్లాడుతున్న మేయర్ వసీం

**ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్**

మూడున్నరేళ్ల వైసిపి పాలనలో అనంతపురంలో అడుగడుగునా చేసిన అభివృద్ధి పనులతో టిడిపి యువ నాయకుడు నారా లోకేష్ సెల్ఫీ ఛాలెంజ్ ఫొటోలు తీసుకోవాలని మేయర్ మొహమ్మద్ వసీం సూచించారు. సోమవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఆయన మాట్లాడుతూ పాదయాత్ర కొనసాగే ప్రాంతంలోనే అభివృద్ధి పనులు సాగుతున్నాయన్నారు. సిఎం జగన్ సహకారం, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి కృషితో పంగల్ రోడ్డు నుంచి లోకేష్ పాదయాత్ర ప్రారంభమయ్యే ప్రాంతం నుంచి బళ్లారి బైపాస్ వరకూ రూ.300 కోట్లతో ఫోర్‌లైన్ రోడ్డు పనులు సాగుతున్నాయన్నాయన్నారు. రోడ్డు సెల్ఫీ తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా సప్తగిరి సర్కిల్ నుంచి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లే దారిలో నిర్మితమవుతున్న ఎంసిహెచ్ బ్లాక్ నిర్మాణ పనుల వద్ద సెల్ఫీ తీసుకోవాలన్నారు. అక్కడి నుంచి కొంచెం ముందుకెళ్తే టిడిపి హయాంలో నాటి నేతల కమీషన్లతో కుచించుకుపోయిన రామ్‌నగర్ రెండు వరుసల ఫ్లైఓవర్ బ్రిడ్జి వస్తుందని, పిటిసి వద్దకు వస్తే వైసిపి హయాంలో నిర్మిస్తున్న నాలుగు వరుసల ఫ్లై ఓవర్ కనిపిస్తుందని ఇలాంటి బ్రిడ్జి మీరెందుకు నిర్మించలేకపోయారని ప్రశ్నించుకోవాలని కోరారు. నగరంలో రూ.800 కోట్ల అభివృద్ధి పనులు చేస్తున్నట్లు వివరించారు. అంతేకాకుండా టిడిపి నేతలు మైనార్టీలను పూర్తిగా విస్మరిస్తే నేడు పదిమందికి కార్పొరేటర్లతోపాటు మేయర్, మార్కెట్ యార్డు ఛైర్మన్ పదవులను కట్టబెట్టిన ఘనత సిఎం జగన్, ఎమ్మెల్యే అనంతకు దక్కుతుందన్నారు. టిడిపి ఎన్ని జిమ్మిక్కులు చేసినా 2024 ఎన్నికల్లో రాష్ట్రంలో 175 స్థానాల్లో వైసిపి అభ్యర్థులే గెలుపొంది మరోమారు ముఖ్యమంత్రిగా జగన్ బాధ్యతలు చేపడుతారని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు అబుసాలేహా, కమల్‌భూషణ్, శ్రీనివాసులు, సోనీ రమణ, తదితరులు పాల్గొన్నారు.

# వాలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

**రాయదుర్గం :** రాయదుర్గం పురపాలక సంఘం పరిధిలో ఖాళీగా ఉన్న 10 వార్డు వాలంటీర్ పోస్టులకు సోమవారం స్థానిక పురపాలక సంఘం కార్యాలయంలో కమిషనర్ వి.దివాకర్ రెడ్డి ఇంటర్వ్యూలు నిర్వహించారు. 10 పోస్టులకు 22మంది దరఖాస్తు చేసుకోగా 16 మంది ఇంటర్వ్యూకు హాజరయ్యారు. ఈ కార్యక్రమములో మేనేజర్ కిశోర్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

# పుట్లూరుకు నేడు ఎమ్మెల్యే పద్మావతి రాక

**పుట్లూరు :** ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి మంగళవారం మండల కేంద్రానికి రానున్నట్లు ఎంపిడిఒ యోగానందరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసరా వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేయనున్న కార్యక్రమంలో పాల్గొని మహిళా సంఘాలకు మెగా చెక్కు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కావున మండలంలోని డ్వాక్రా మహిళలు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

# భావితరాలకు ఆదర్శంగా నిలవాలి

**బ్రహ్మసముద్రం :** వసతి గృహాల్లో చదివే విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నతస్థాయికి చేరుకుని భావితరాలకు ఆదర్శంగా నిలవాలని ఎస్సీ వసతిగృహ సంక్షేమ అధికారి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు సరస్వతి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలను దృష్టిలో ఉంచుకుని పిల్లలందరూ మంచిగా చదివి ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో 10వ తరగతి విద్యార్థులు, వసతి గృహ సిబ్బంది పాల్గొన్నారు.

# 'వన్ ర్యాంక్ వన్ పెన్షన్'లో అక్రమాలను అరికట్టాలి

**అనంతపురం :** వన్ ర్యాంక్ వన్ పెన్షన్‌లో జరిగిన లోపాలను సరిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా మాజీ సైనికుల సంఘం అధ్యక్షులు కెప్టెన్ షేకన్న కోరారు. ఈమేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ నాగలక్ష్మిని కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సమస్యలను వెంటనే ప్రధాని నరేంద్ర మోడీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. ఇందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికుల సంఘం ప్రధాన కార్యదర్శి పట్నం ఉమామహేశ్వరరావు, తిమ్మారెడ్డి, అబ్దుల్‌ఖాదర్, ఈశ్వరయ్య, వై.ప్రసాద్, సిద్దన్న,బాలస్వామి,బి ఏ హుస్సేన్,రంగారెడ్డి,నబీరసూల్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# డిఎంహెచ్ఒ జట్టుపై కిమ్స్ సవీరా విజయం

### 8 వికెట్ల తేడాతో జయకేతనం - ముగిసిన టిసిఎ కార్పొరేట్ లీగ్

**ప్రజాశక్తి-అనంతపురంకలెక్టరేట్**

టిసిఎ కార్పొరేట్ క్లబ్ టీ-20 క్రికెట్ టోర్నమెంట్‌లో కిమ్స్ సవీరా జట్టు విజయం సాధించింది. రెండు నెలలుగా జిల్లాలోని ప్రముఖ కార్పొరేట్ సంస్థల మధ్య టీసీఏ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ కొనసాగుతోంది. ఇందులో భాగంగా సోమవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో కిమ్స్ సవీరా, డిఎంహెచ్ఓ జట్లు తలపడ్డాయి. మొదట టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న డిఎంహెచ్ఒ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 127 పరుగులకు ఆలౌటైంది. అనంతరం బ్యాటింగ్ చేసిన కిమ్స్ సవీరా జట్టు కేవలం 9.5 ఓవర్ల 2 వికెట్లు కోల్పోయి విజయఢంకా మోగించింది. కిమ్స్ సవీరా జట్టులో నరేంద్ర (54), కిషోర్ రెడ్డి, (42), ప్రదీప్ (26) పరుగులు చేసి కీలక పాత్ర పోషించారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌ను నరేంద్ర అందుకున్నారు. అలాగే కెఎస్.మున్సు 4 ఓవర్లకు 11 పరుగులు ఇచ్చి 4 వికెట్లు పడగొట్టాడు. నరేంద్ర 4 ఓవర్లకు 13 పరుగులు ఇచ్చి 3 వికెట్లు పడకొట్టారు. కిమ్స్ సవీరా జట్టులో ఎస్.వి. కిషోర్ రెడ్డి (కెప్టెన్), శ్రీకాంత్ రెడ్డి, దినేష్, బిస్మిల్లా, ప్రదీప్, నరేంద్ర, మహేష్, ముసాధిక్, సాయికుమార్, పవన్ కుమార్, మధు కిరణ్, కిరణ్, సాగర్, గిరి, శ్యాముల్, లీనేష్ జట్టులో ఉన్నారు. అనంతరం టీసీఏ క్రికెట్ క్లబ్ ఛైర్మన్ శివారెడ్డి విజేత జట్టుకు ట్రోఫీ అందజేశారు.

# పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

### ఐసిడిఎస్ సూపర్‌వైజర్ బి.శ్రీదేవి



గుంతకల్లులో వెల్ బేబీ షో నిర్వహిస్తున్న దృశ్యం

**ప్రజాశక్తి-గుంతకల్లు**

ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ బి.శ్రీదేవి సూచించారు. సోమవారం స్థానిక బిటి పక్కీరప్ప కాలనీ, ఇందిరానగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార పక్షోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్చి 23 నుంచి ఏప్రిల్ 3వతేదీ వరకు పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఎటువంటి పౌష్టికాహారం తీసుకోవాలి.. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే ఉపయోగాలు, చిరుధాన్యాల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించినట్లు తెలిపారు. పౌష్టికాహారంతోపాటు ఆకుకూరలు, కూరగాయలు తీసుకోవాలన్నారు. అనంతరం వెల్ బేబీషో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎంలు శారద, అన్నపూర్ణ, అంగన్‌వాడీలు రత్న, ధనలక్ష్మి, రమా, మేరీ, మరియమ్మ, ఆయాలు సరోజ,సుంకమ్మ, మునెమ్మ, సత్య, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

**నార్పల :** మండల పరిధిలోని బి.పప్పూరు అంగన్‌వాడీ కేంద్రంలో సిడిపిఓ భారతి, బొందలవాడ సెక్టార్ సూపర్‌వైజర్ మధుమాలిని ఆధ్వర్యంలో పౌష్టికాహార పక్షోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్చి 23 నుంచి నిర్వహించిన పక్షోత్సవాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. అనంతరం వెల్ బేబీషో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు తృణీత, వెంకటలక్ష్మి, తులసమ్మ, ఆదినారాయణమ్మ, శ్రీదేవి, సుజాత, పార్వతీ సుధామణి తదితరులు పాల్గొన్నారు.

# యువత రక్తదానం చేయాలి : బిసాటి భరత్




రక్తదానం చేస్తున్న యువకుడు

**ప్రజాశక్తి-అనంతపురం**

యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని రాయచూర్ జిల్లా యువ అధికారి బిసాటి భరత్ పిలుపునిచ్చారు. అజాది కా అమృత్ మహోత్సవంలో భాగంగా ప్రగతి పథం యూత్ అసోసియేషన్, ఎస్ఆర్ ఎడ్యుకేషన సొసైటీ, నెహ్రూ యువ కేంద్ర భారత ప్రభుత్వం సంయుక్త సహకారంతో ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థ స్వచ్ఛంద రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చన్నారు. రక్తదానం చేయడం ద్వారా మరో ముగ్గురి ప్రాణాలను కాపాడవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ గోపీనాథ్, సుంకర రమేష్, ఎస్ఆర్.ఎడ్యుకేషన్ సొసైటీ వ్యవస్థాపకులు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత జీవన్‌కుమార్, మానసిక వైద్యులు గరుగు బాలాజీ, యువ నాయకుడు పవన్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర సేవా అవార్డు గ్రహీతలు జయ మారుతి, సంస్థ సభ్యులు ఫణేశ్వర్, రామ్‌భూపాల్, దేవాదిరెడ్డి, గౌతంరెడ్డి, తుకారాం, శీను, చిన్న దినేష్, అజయ్, శేషాద్రి, హితేష్, పవన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా 'పది' పరీక్షలు

**బొమ్మనహాల్ :** మండలవ్యాప్తంగా నాలుగు కేంద్రాల్లో సోమవారం జరిగిన పదోతరగతి పరీక్షలకు 18 మంది గైర్హాజరైనట్లు ఎంఇఒ తిమ్మప్ప తెలిపారు. ఫాదర్ జూనియర్ కళాశాలలో 194 మంది, జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 300, ప్రతిభ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 250, బిలో 250 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 18 మంది గైర్హాజరైనట్లు తెలిపారు.

**పుట్లూరు :** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. 346 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా నలుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు.

**శింగనమల :** మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్, కెజిబివి పాఠశాలల్లో సోమవారం ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా సాగినట్లు ఎంఇఒ నరసింహరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈఓ నరసింహారావు మాట్లాడుతూ జడ్పీహెచ్ఎస్ స్కూల్ సెంటర్‌లో 310 మందికి ఇద్దరు, కెజిబివి పాఠశాలలో 154 మందికి ఒకరు గైర్హాజరు అయినట్లు తెలిపారు. ఆయా కేంద్రాల్లో విద్యార్థులు ఎలాంటి అసౌర్యానికి గురి కాకుండా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

**పెద్దపప్పూరు :** మండల కేంద్రంలో సోమవారం మొదటిరోజు పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పెద్దపప్పూరు హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కేంద్రంలో 232 మందికి ఇద్దరు, జూటూరు జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 104 మందికి ఒకరు, జూటూరు కస్తూరిబాలో 106 మందికి ఆరుగురు గైర్హాజరైనటుల ఎంఇఒ శ్రీదేవి తెలిపారు.

**రాయదుర్గం :** పట్టణంలో సోమవారం ప్రారంభమైన 10వ తరగతి పరీక్షలు సజావుగా సాగాయి. పట్టణంలోని ఆరు ఉన్నత పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా 1395 మంది విద్యార్థులకు 1345 మంది హాజరై 50 మంది గైర్హాజరైనట్లు ఎంఇఒ నాగమణి తెలిపారు. ఇందులో భాగంగా బళ్లారి రోడ్డు పక్కన ఉన్న బాలగంగాధర్ తిలక్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసినట్లు తెలిపారు.



బెలుగుప్పలో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

**బెలుగుప్ప :** మండలంలో ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా సాగినట్లు మండల విద్యాధికారి మల్లారెడ్డి తెలిపారు. మండల వ్యాప్తంగా 460 విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 9మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఎస్ఐ రామకృష్ణయ్య, ఎఎస్ఐ రామదాసు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

# 'పది' కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు : డీఎస్పీ

**గుంతకల్లు :** పట్టణంలో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు డీఎస్పీ యు.నరసింగప్ప తెలిపారు. ఈమేరకు సోమవారం స్థానిక రైల్వే హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి మాస్ కాపీయింగ్‌లు జరగకుండా చర్యలు చేపట్టామన్నారు. అలాగే కంప్యూటర్, జిరాక్స్ సెంటర్లను బంద్ చేయించామన్నారు. అదేవిధంగా పరీక్ష కేంద్రాలు వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ 30 యాక్ట్ అమలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య, టూటౌన్ ఎస్ఐ నరేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

# 'యువగళం'లో రుద్రమనాయుడు

**యాడికి :** నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రలో టిడిపి మండల కన్వీనర్ గొర్తి రుద్రమనాయుడు సోమవారం పాల్గొన్నారు. అనంతపురానికి చేరుకుని పాదయాత్రలో రుద్రమనాయుడు కొంతదూరం లోకేష్‌తో కలిసి పలు సమస్యలపై చర్చించినట్లు తెలిపారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని పాదయాత్రను విజయవంతం చేయాలని కోరారు.

# బొంబాయి రమేష్‌కు శుభాకాంక్షలు

**యాడికి :** మార్కెట్ వీధిలోని కార్యాలయంలో వైసిపి మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు పుట్టినరోజు వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా అభిమానులు ఏర్పాటు చేసిన కేక్‌ను ఎంపిపి ఉమాదేవితో కలిసి కట్ చేశారు. అనంతరం కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతులను ఆదుకోవాలని ధర్నా

**నార్పల :** మండలంలో ఇటీవల కురిసిన అకాల వడగండ్ల వర్షాల వల్ల తీవ్రస్థాయిలో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని కోరుతూ టిడిపి నాయకులు అలం వెంకట నరసానాయుడు ఆధ్వర్యంలో రైతులతో కలిసి సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతనెలలో కురిసిన వర్షాలు, వడగండ్ల వాన వల్ల పలు గ్రామాల్లో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ముఖ్యంగా అరటి, బొప్పాయి రైతులు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ఎర్రినాగప్ప, పిట్టు రంగారెడ్డి, రాఘవనాయుడు, జాఫర్, చంద్రబాబు, అలం వెంకటరమణ, శ్రీరాములు, భక్తవత్సల, చిన్ననాయుడు, ముత్తినేని సత్యనారాయణ, బొగ్గు నారాయణస్వామి, బొగ్గు నాగార్జున, చంద్రమోహన్‌రెడ్డి, కరేపాకు నల్లప్ప, పిఎల్ లక్ష్మీనారాయణ, రమేష్, ప్రసాద్, నాగరాజు, వెంకటరాముడు, చంద్రమౌళి, నాగేష్, ఆదెప్ప, మురళి, పులసలనూతల కాటమయ్య, తలారి మహేష్, వెంకటపతి, వంశీ, తలారి హరీష్, వడ్డే మహేష్, గణేష్, పవన్, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు భూమిపూజ

**ఉరవకొండ :** విడపనకల్ మండల పరిధిలోని డోనేకల్ కడదరబెంచి తదితర గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు జడ్పిటిసి హనుమంతు, మార్కెట్ యార్డు డైరెక్టర్ రమేష్ సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా జడ్పిటిసి మాట్లాడుతూ నియోజకవర్గ ఇన్‌ఛార్జి విశ్వేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు మండలంలో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ముఖ్యంగా గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన సమస్యల పరిష్కారం కోసం రూ.20 లక్షల నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఈ మొత్తంలో డోనేకల్ గ్రామానికి రూ.12 లక్షలు, కడదరబెంచికి రూ.8 లక్షలు కేటాయించి సిసి రోడ్లు వేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా పలు గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసేందుకు జెడ్పీ గ్రాంట్స్ కింద రూ.7.50 లక్షము మంజూనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు గోపాల్, లేపాక్షి, ఈరన్న, బద్రి, బండెప్ప రెడ్డి, చిన్న, శేఖర్, మారెప్ప, తదితరులు పాల్గొన్నారు.

# జెఎన్‌టియు బోధనేతర సిబ్బంది బదిలీలు

**ప్రజాశక్తి-అనంతపురం**

వైస్ ఛాన్సలర్ జి.రంగజనార్ధన ఆదేశాల మేరకు స్థానిక జెఎన్‌టియు పరిధిలోని బోధనేతర సిబ్బందిని బదిలీ చేస్తూ రిజిస్ట్రార్ సి.శశిధర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సూపరింటెండెంట్ మహేష్‌ను కలికిరి ఇంజినీరింగ్ కళాశాలకు, అక్కడ పని చేస్తున్న సూపరింటెండెంట్ మురళీకృష్ణను పులివెందుల ఇంజినీరింగ్ కళాశాలకు, అనంతపురం ఇంజినీంగ్ కళాశాలలో పని చేస్తున్న సూపరింటెండెంట్ జనార్ధన్‌రెడ్డిని రీసెర్చ్ డెవలప్‌మెంట్ కార్యాలయానికి, పులివెందుల సూపరింటెండెంట్ సునీల్‌కుమార్‌ను అనంత జెఎన్‌టియుకు ఉపకులపతి సెక్రటరీగా, అనంత జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల నుంచి సీనియర్ అసిస్టెంట్ కె.సుదర్శన్‌ను ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్‌కు, పులివెందులలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న పి.రాజేష్‌ను అనంత జెఎన్‌టియు ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్‌కు, సీనియర్ అసిస్టెంట్ పి. రాఘవేంద్రను పులివెందుల ఇంజినీరింగ్ కళాశాల నుంచి, అనంత జెఎన్‌టియు అకౌంట్ సెక్షన్‌కు, సీనియర్ అసిస్టెంట్ వి.రాఘవరెడ్డిను పులివెందుల ఇంజినీరింగ్ కళాశాల నుంచి జెఎన్‌టియు అకాడమిక్ ఆడిట్ కార్యాలయానికి, సీనియర్ అసిస్టెంట్ జి.శశికిరణ్‌ను పులివెందుల ఇంజినీరింగ్ కళాశాల నుంచి ఓటిపిఆర్ఐ కళాశాలకు, సీనియర్ అసిస్టెంట్ ఎన్.రవికుమార్‌ను అనంత జెఎన్‌టియు నుంచి పులివెందులకు, అనంత సీనియర్ అసిస్టెంట్ ఎస్.కుమారిను పులివెందుల ఇంజినీరింగ్ కళాశాలకు, సీనియర్ అసిస్టెంట్ సి.ముత్యాలును అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల నుంచి పులివెందుల ఇంజినీరింగ్ కళాశాలకు, సీనియర్ అసిస్టెంట్ గౌసియా నస్రీన్‌ను అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల నుంచి పులివెందుల ఇంజినీరింగ్ కళాశాలకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.